క్లుప్తంగా

మోసం చేసిన మహిళ అరెస్ట్

శాయంపేట : ఇల్లు అమ్ముతామని చెప్పి కొంత డబ్బును తీసుకుని మోసం చేసిన మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మామిడి సదాశివ, సదానందం, శ్రీదేవి ముగ్గురు వారి అవసరాల నిమిత్తం మండల కేంద్రంలోని ఇల్లును రూ.42 లక్షల 25వేలకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అదే గ్రామానికి చెందిన బాల్నే తిలక్‌బాబు ఇల్లు కొనుగోలుకు ముందుకొచ్చి బయానాగా మొదట రూ.15లక్షల గ్రామ పెద్దల సమక్షంలో చెల్లించాడు. మిగితా డబ్బులు రిజిస్ట్రేషన్ సమయంలో ఇవ్వాలని ఇరువురు ఒప్పదం చేసుకున్నారు. కాగా తిలక్ బాబుకు ఇల్లు రిజిస్ట్రేషన్ చేయకుండా, బయానా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడంతో తీవ్ర మనోవేధనకు గురైన తిలక్ బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అయినా సదరు వ్యక్తులు ఇల్లు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో అతడి భార్య బాల్నే కవిత సదరు వ్యక్తులైన సదాశివ, సదానందం, శ్రీదేవిపై ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితులు మూడు నెలల నుంచి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మామిడి శ్రీదేవి శాయంపేటలో తన ఇంటికి వచ్చిందనే సమాచారం మేరకు శ్రీదేవిని అదుపులోకి తీసుకుని పరకాల కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

సదరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు

మండల కేంద్రానికి పురాణం రాజేందర్‌ను సైతం ఈ ముగ్గురు వ్యక్తులు మోసం చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందని నమ్మించి మోసం చేశారని రాజేందర్ ఫిర్యాదు మేరకు వారిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఎల్కతుర్తి : అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని సూరారం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోదాటి మాధవరావు (69) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెంది ఈనెల 22న తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను గడ్డిమందు తాగినట్లు సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు వ్యవసాయ బావివద్దకు వెళ్లి మాధవరావును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మాధవరావు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళను వేధించిన ఒకరిపై కేసు

వేలేరు : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళతో అర్ధరాత్రి సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీరా సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21న మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన తల్లితో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా వేలేరుకు చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి పలుమార్లు ఫోన్ చేశాడని, ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి తలుపులు కొట్టినట్లు తెలిపారు. దీంతో భయాందోళన చెందిన సదరు మహిళ చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి పిలవడంతో అతడు పారిపోయి మళ్లీ వచ్చి తలుపులు కొడుతూ తీయకపోతే చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



వేలేరు : ధర్మసాగర్ మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు తల్లి సక్కుబాయి, వేలేరు మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, వెన్నం అమృతమ్మలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, నాయకులు సోమిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నర్సింగరావు, మహేందర్, సంపత్ పాల్గొన్నారు.

వర్కర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

నల్లబెల్లి : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకుడు గుగులోత్ రాములునాయక్ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా మత్తడిరోడ్డు

- జాతీయ రహదారిపై ఉండడంతో వాహనదారుల భయాందోళన
- కానరాని సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



కటాక్షపూర్ మత్తడి రోడ్డుపై ఏర్పడిన గుంతలు, పారుతున్న నీరు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి (163)పై మత్తడి ఉండంతో ప్రయాణికులు జంకుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాదిగా లారీలు, బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొద్ది రోజులుగా మత్తడి నీరు రోడ్డుపై నుంచే పారుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మత్తడి ప్రవాహం తగ్గినప్పటికీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ వర్షాలతో పనులు మందగించాయి. వంతెన నిర్మాణంలో జాప్యం జరుగుతుందని, ప్రధానమైన మార్గం కావడంతో తాత్కాలిక మరమ్మత్తులు చేపడుతున్నప్పటికీ రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మేడారంలో నిర్వహించనున్న జాతర వరకైనా వంతెన నిర్మాణం పూర్తవుతుందో, లేదోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మత్తడి రోడ్డును బాగుచేయాలని స్థానికులు, కోరుతున్నారు. అలాగే వాహనదారులకు రాత్రి కనబడే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సిరంగి సౌందరయ్య సేవలు చిరస్మరణీయం



దామెర : నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పరకాలలో..

దామెర : షాహిద్ సిరంగి సౌందరయ్య సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి అన్నారు. సౌందరయ్య 24వ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ.. సౌందరయ్యను నక్సలైట్లు హత్య చేయడం సరికాదని అన్నారు. మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు సుధాకర్, సంతోశ్‌బాబు, రమణారెడ్డి, రాజయ్య, రమేశ్, ప్రశాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పరకాల : వైద్య వృత్తిపరంగా, రాజకీయకంగా ఎంతో మంది నిరుపేదలకు సామాజిక సేవలు అందించి అండగా నిలిచిన బీజేపీ సీనియర్ నేత దివంగత డాక్టర్ సిరంగి సౌందరయ్య సేవలు మరువలేనివని బీజేపీ నాయకులు కొనియాడారు. నక్సలైట్ల చేతిలో అమరుడైన సౌందరయ్య 24వ వర్ధంతిని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సౌందరయ్య కుమారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు నిరంజన్, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు గురుప్రసాద్, మేఘనాథ్, జంగారెడ్డి, జయంత్‌లాల్, రామన్న, భిక్షపతి, పట్టణ నాయకులు సతీశ్, సంఘ పురుషోత్తం, విజయ్‌కుమార్, తిరుపతి, నరేశ్ పాల్గొన్నారు.

మెపా జిల్లా సంయుక్త కార్యదర్శిగా సూర్యప్రకాశ్



నియామకపత్రాన్ని అందజేస్తున్న దేవేందర్

శాయంపేట : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా సంయుక్త కార్యదర్శిగా మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన పల్లెబోయిన సూర్యప్రకాశ్‌ను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, నీరటి రాజు, జిల్లా అధ్యక్షుడు రాజేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు విజేందర్, జిల్లా కార్యదర్శులు కోటేశ్వరరావు, నరేష్,కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీకాంత్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొర్రె మహేందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా బుధవారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం భూపాలపల్లి పర్యటనలో భాగంగా మాందారిపేట స్టేజి వద్ద ఎస్సీ సబ్‌ప్లాన్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని యువకులు తరలివచ్చి అభిప్రాయాలను తెలుపాలని శ్రీకాంత్ కోరారు.

టీపీసీసీ ఎస్సీసెల్ వైస్ చైర్మన్‌గా..

పరకాల : టీపీసీసీ ఎస్సీసెల్ వైస్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన డాక్టర్ మడికొండ శ్రీనును నియమించినట్లు ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నాగరిగిరి ప్రీతం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తన నియామకానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్యకు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్



ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో మాట్లాడుతున్న జైపాల్

దామెర : యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని స్థానిక ఒకేషనల్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు జైపాల్ అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా నాల్గో రోజు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించే విధంగా యువత నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఎంచుకున్న లక్ష్యానికి చేరే వరకు పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ముందు గ్రామంలోని దామేశ్వరాలయం, చెరువుకట్ట, గోశాల పరిసర ప్రాంతాల్లో వలంటీర్లు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు మహేందర్, భిక్షం, వలంటీర్లు తదితరలు పాల్గొన్నారు.

అన్నపూర్ణ అలంకరణలో అమ్మవారు



ఆత్మకూరు : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు




పరకాల : అన్నపూర్ణదేవి అలంకరణలో దుర్గాదేవి

పరకాల : పట్టణంలోని కనకదుర్గ మదనపోచమ్మ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. కాగా కొక్కిరాల రాకేశ్‌రావు దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సారంగపాణి, మేఘనాథ్, వీరేష్‌రావు, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేణుగోపాల స్వామి భజన మండలి ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం రెండోరోజు వైభవంగా కొనసాగుతున్నాయి. అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



శాయంపేట : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను శాలువాతో సన్మానించారు. దళిత, గిరిజన, బహుజన వర్గాల భూ సమస్యలను పరిష్కరించేందుకు చొరువ చూపాలని కోరారు. నాయకులు దేవయ్య, ముఖేష్, వెంకటేష్, భాస్కర్, చిరంజీవి, కుమార్, ప్రభాకర్, విజయ్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

నర్సంపేట : ఐక్యపోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఐరన్, హార్డ్‌వేర్ అండ్ ప్లైవుడ్ వర్కర్ యూనియన్ (ఏఐసీటీయూ అనుబంధం) గౌరవ అధ్యక్షుడు పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలో పాశం రాజిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఐరన్, హార్డ్‌వేర్, ప్లైవుడ్ షాపుల కార్మికుల సంయుక్త సమావేశానికి రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్పత్తిలో కార్మికుల భూమిక కీలకమన్నారు. హక్కుల సాధనకు పోరాటాలు తప్పవని చెప్పారు. ఏఐసీటీయూ జిల్లా కోశాధికారి మాషుక్ మాట్లాడుతూ శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులకు యూనియన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం నర్సంపేట ఐరన్, హార్డ్‌వేర్ అండ్ ప్లైవుడ్ వర్కర్స్ యూనియన్ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా పెద్దారపు రమేశ్, అధ్యక్షుడిగా పాశం రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ముత్యాల భద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా కుడుతాల రాజు, కోశాధికారిగా సముద్రాల అశోక్, సహాయ కార్యదర్శిగా చింతల శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా మహ్మద్ మాషుక్, కార్యవర్గ సభ్యులుగా దూదె మల్లయ్య, మాదాటి మణి, రాసమల్ల కృష్ణమాచారి, పోతబోయిన శ్రావణ్, సంగెపు శ్రావణ్, వాసు, శ్రీను ఎన్నికయ్యారు.

కళాకారులకు టీషర్టుల పంపిణీ

నర్సంపేట : నెక్కొండ మండలంలోని గుండ్రపల్లెకు చెందిన తన చిన్నమ్మ కుమారుడు నల్గొండ సురేశ్ ఇటీవల మృతిచెందాడు. కాగా ఆయన జ్ఞాపకార్థం చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన డప్పు కళాకారులకు కాంగ్రెస్ పార్టీ స్థానిక మాజీ వార్డు సభ్యుడు కన్నం వెంకన్న మంగళవారం టీ షర్టులను పంపిణీ చేశారు.

పట్టణంలో ప్రకాశ్‌రెడ్డి వర్ధంతి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పరకాల : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ప్రకాశ్‌రెడ్డి వర్ధంతిని పట్టణంలో సీపీఐ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దున్నేవాడికి భూమి కావాలంటూ నిజాం పరిపాలనపై పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ప్రకాశ్‌రెడ్డి అని కొనియాడారు. సీపీఐ నాయకులు సాంబయ్య, సమ్మిరెడ్డి, చంద్రమౌళి, శాంతికుమార్, క్రాంతికుమార్, మహిళా నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ప్రణవ్

కమలాపూర్ : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, కష్టపడిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీహాల్‌లో వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, పలు కుల సంఘాల నాయకులు సుమారు 300 మంది మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్య, వైద్యం, నైపుణ్య శిక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అందులో భాగంగానే హుజూరాబాద్‌కు ఏటీసీ కాలేజీ మంజూరు చేయించామని చెప్పారు. రాజకీయంగా ఉన్నత పదవులు అనుభవించినవారు ఈ విషయంపై ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నించారు. కమలాపూర్ బస్టాండ్‌కు సంబంధించి ఇప్పటికే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఆస్పత్రికి సంబంధించి మంత్రి దామోదర రాజనర్సింహకు నివేదికలు అందజేశామని, త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నా నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడమే వారి పనని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. నాయకులు రవీందర్, రమేశ్‌గౌడ్, డాక్టర్ కుమారస్వామి, శనిగరపు రమేశ్, పాక చంద్రమౌళి, బాషబోయిన రమేశ్, శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



ఎంజీఎం : సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం : వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరులో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ ప్రత్యేక వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని, శిబిరాలకు వచ్చే మహిళలు తమ వెంట ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఇవే కాకుండా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్కోరోజు ఒక్కో స్పెషలిస్ట్ డాక్టర్ సేవలందిస్తారని తెలిపారు. ఆశలు, ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని క్యాంపుల షెడ్యూల్ ప్రకారం స్థానిక మహిళలను ఈ వైద్య శిబిరాలకు తీసుకురావాలని ఆదేశించారు. ఆత్మకూరు వైద్యాధికారి స్వాతి, స్పెషలిస్ట్ వైద్యులు అక్షర బిందు, శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపూర్ / ఐనవోలు : స్వస్థ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్యులతో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన స్త్రీల వైద్య నిపుణులతో, 25న జనరల్ ఫిజీషియన్‌తో, 27న మెగా వైద్యశిబిరం, 29న, అక్టోబర్ 1, 2 తేదీల్లో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి నుంచి స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అక్షర, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆఫ్రిన్, పిల్లల వైద్యనిపుణుడు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తిచేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కమలాపూర్ : నెలాఖరులోగా ఉపాధి హామీ పథకం కూలీల ఈకేవైసీని పూర్తిచేయాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి (ఇన్‌చార్జ్) శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో ఈకేవైసీ, ఉపాధి హామీ పనులు, ప్లాంటేషన్లపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడేళ్ల నుంచి ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన అన్ని రకాల ప్లాంటేషన్లలో నూరు శాతం మొక్కలు తప్పనిసరిగా బతికేలా చూడాలని, ప్రతి ప్లాంటేషన్‌కు వాచర్‌ను నియమించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులతో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా తప్పనిసరిగా మరుగుదొడ్డి నిర్మించేలా చైతన్య పరిచి లబ్ధిదారుడికి రూ.12 వేలు అందించాలని అన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత నిర్మించేలా చేసి రూ.6,544 అందించాలని, ప్రతి ఇందిరమ్మ లబ్ధిదారుడికి ఉపాధి హామీ పథకంలో 90 రోజుల హాజరు వేసి రూ.27,630 అందించాలని అన్నారు. ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీసీ శ్రీధర్, ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, ఉపాధి హామీ పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

- డీడబ్ల్యూఓ జయంతి



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జయంతి

ఆత్మకూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి జయంతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేసి పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై సిబ్బంది దృష్టిసారించాలన్నారు. డాక్టర్లు స్వాతి, అక్షర బిందు, శ్రావణ్, పుష్ప, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు శ్రీవిద్య, కరుణ, పుష్పలీల, వాణి, పద్మ, దేవమ్మ, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు స్కీంలు ప్రభుత్వమే నిర్వహించాలి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

ఐనవోలు : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన నాలుగు స్కీంలను ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ అనుబంధ యూనియన్ యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(యూబీడబ్ల్యూయూ) జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నందనం గ్రామంలో యూబీడబ్ల్యూయూ మహాసభ ఇస్రం సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. యూబీడబ్ల్యూయూ నిర్వహించే నాలుగు స్కీంలను ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకు అప్పజెప్పేందుకు జీఓ 12ను విడుదల చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్యంగా భవన నిర్మాణ కార్మికులందరినీ సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గ్రామకమిటీ ఎన్నిక

నందనం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యాకర రమేశ్, కార్యదర్శిగా ఈశ్వరం సుదర్శన్, గౌరవ అధ్యక్షుడిగా ఇసురం చిన్నబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లయ్య, కోశాధికారిగా యాకర శ్రీనివాస్, గౌరవ సలహాదారుగా యాకర మల్లయ్య, సహాయ కార్యదర్శిగా దోమకొండ కనకయ్య, ఉపాధ్యక్షుడు సోమయ్యతో పాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.